


చీరల పంపిణీ


ప్రజాశక్తి-అరకులోయ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ మాజీ జనరల్ సెక్రటరీ తారకనాథ్ వర్ధంతి సందర్భంగా అరకు వ్యాలీ ఎస్.బి.ఐ స్థానిక సెక్రటరీ వి..అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బోసుబెడ గ్రామంలో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం తారకనాథ్‌కు నివాళి అర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ పి విజయ్ కుమార్, కామేష్, శేఖర్, ఎస్‌బిఐ సిబ్బంది క్రాంతి కుమార్, సురేంద్ర, అనిల్, ప్రసన్న పాల్గొన్నారు.


చీరల పంపిణీ చేస్తున్న ఎస్‌బిఐ సిబ్బంది

యోగాకు భారీగా తరలింపు

ప్రత్యేక బస్సుల్లో విశాఖకు వెళ్లిన గిరిజన విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు తరలి వెళ్లారు. వీరిని జిల్లాలో ఎంపిక చేసిన విడిది కేంద్రాలకు శుక్రవారం ఉదయమే ప్రత్యేక బస్సుల్లో చేర్చారు. రాత్రికి అక్కడే భోజనం, వసతి సదుపాయాలు కల్పించి, శనివారం ఉదయం విశాఖ ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్ లో యోగా దినోత్సవ వేడుకలు పూర్తయిన తరువాత తిరిగి బస్సుల్లో ఎక్కించి స్వస్థలాలకు చేరుస్తారు. ఈ మేరకు పాడేరు ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలల నుంచి సుమారు 26,395 మంది విద్యార్థులను విశాఖకు తరలించడానికి టిడబ్ల్యూ డిడి ఎల్.రజని ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. విశాఖ వేదికగా ఈ నెల 21న నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథులుగా హాజరుకానున్న విషయం తెలిసిందే. యోగాంధ్ర- 2025 వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వ యంత్రాంగం..రెండు వారాల క్రితమే ఏర్పాట్లు మొదలు పెట్టింది. విశాఖలో జరిగే యోగా దినోత్సవంలో అల్లూరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. టిడబ్ల్యూ డిడి ఎల్. రజని వెల్లడించిన వివరాల ప్రకారం..పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 106 ఆశ్రమ, గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు మొత్తం 26,395 మంది యోగాంధ్ర వేడుకలకు హాజరు కానున్నారు. ఆయా మండలాల్లోని పాఠశాలలకు వేర్వేరుగా విద్యార్థులు కోసం 495 ప్రత్యేక బస్సులను కేటాయించారు. ప్రతి బస్సులో 40 నుంచి 50 మంది వెళ్లడానికి వీలుంటుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల పరిధిలోని 54 ఆర్టీసీ డిపోలకు చెందిన 495 బస్సులను గురువారం సాయంత్రానికే జిల్లాకు రప్పించారు. ఏ ప్రాంతం బస్సులు, ఏ మార్గంలో విశాఖలోని యోగా వేదికల వద్దకు చేరుకోవాలో రూట్ మ్యాప్లను సిద్ధం చేశారు. విద్యార్థులను తీసుకెళ్లే ప్రతి బస్సులో ఒక హెచ్ఎం, ఎఎన్ఎం, పిడి అలాగే ప్రతి 25 మంది విద్యార్థులకు సహాయకులుగా ఒక టీచర్ ఉండేలా బాధ్యతలు అప్పగించారు. విశాఖలో 13 చోట్ల రాత్రికి అక్కడే బస, భోజనం ఏర్పాట్లు చూసేందుకు ఎటిడబ్ల్యూఒలను నియమించారు. యోగాకు వెళు తున్న ప్రతిఒక్కరి వివరాలను జియో ట్యాగింగ్ విధానంలో నమోదు చేశారు.


బస్ ఎక్కుతున్న విద్యార్థులు


బస్‌లో కూర్చున్న విద్యార్థులు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య

ఆర్టీసీ డిపో హామీ నెరవేర్చకపోవడం సిగ్గుచేటు

- సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, సీతారామయ్య

ప్రజాశక్తి- కూనవరం : ఆంధ్రాలో విలీనం తర్వాత ముంపు మండలాలకు కేంద్రంగా ఆర్టిసి డిపో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చక పోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు పాయం సీతారామయ్య అన్నారు. శ్రీ మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలు ఉమ్మడి రాష్ట్రం నుండి విలీనమైన పాపానికి నిత్యం రంపచోడవరం, రాజమండ్రి, పాడేరు కాకినాడ ప్రభుత్వ పథకాల అవసరాల కోసం, విద్యార్థుల చదువుల నిమిత్తం ఉద్యోగస్తులు విధి నిర్వహణపై నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంలో అనేక ఆంక్షలు, బంద్‌ల పేరుతో అధికభాగం బస్ సర్వీసులను నిలిపివేయడం ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయన్నారు. గోకవరం డిపో బస్సులు సమయపాలన పాటించడం లేదని, ఇకనైనా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం కళ్లు తెరచి ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం చింతూరు ఆర్టిసి డిపోని ప్రారంభించాలని డిమాండ్ చేసారు. సమావేశంలో పార్టీ నాయకులు తాళ్లూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం

విద్యార్థుల ఎదురుచూపు

-టీచర్‌ను నియమించని ప్రభుత్వం


పాఠశాలలో నేలపై కూర్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చింతపల్లి: వేసవి సెలవులు పూర్తి చేసుకుని పాఠశాలలు పున్నప్రారంభమై దాదాపు పది రోజులు గడుస్తున్నా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని అత్యంత వెనుకబడిన బలపం పంచాయతీ పరిధిలోని గిల్లాలబంధ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించలేదు. ఈ పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులను నియమించక పోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. పాఠశాలలో చిన్నారులు దీనంగా , నేలపై కూర్చుని ఆశతో ఎదురుచూస్తున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా గిల్లాలబంధ పాఠశాలలో ఆ ఛాయలు కానరాలేదు. మట్టి నేలపైనే , విద్యార్థులు చదువుతున్నారు.

స్థానికుల సమాచారం మేరకు గతేడాది ఈ పాఠశాలలో ఉపాధ్యాయురాలు కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేశారు. కాంట్రాక్ట్ ప్రతిపాదికన పనిచేసిన ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆమోదం తెలపక పోవడంతో కొత్తగా ఎవరిని నియమించకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్టు తెలిసింది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధి, పిల్లల భవిష్యత్ పట్ల నిబద్ధతపై పని చేస్తున్నామని చెపుతున్నా ఆ పరిస్థితి ఇక్కడ కనిపించ లేదు. ఉపాధ్యాయుడిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

స్పెషల్ డిఎస్‌సి, శతశాతం రిజర్వేషన్‌పై

యోగాంధ్రలో సిఎం ప్రకటన చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

ప్రజాశక్తి- అరకు లోయ: ఏజెన్సీ ప్రత్యేక డిఎస్సి, ఆదివాసీ ప్రాంతాల్లో శతశాతం ఉపాధ్యాయ, ఉద్యోగ కల్పనకు సంబంధించి రిజర్వేషన్లపై ప్రధాన మంత్రి జోక్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవంలో స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. గిరిజన రిజర్వేషన్ పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జోక్యం చేసుకోవాలన్నారు. ప్రత్యేక డిఎస్సి ప్రకటనలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరకువేలి గిరిజన సంఘం భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి జి. బుజ్జిబాబు,ఉపాధ్యక్షులు కిల్లో జగనాధం, టి.జోషిలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసులకు 100శాతం ఉద్యోగ నియామక రిజర్వేషన్ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అంతరవకు ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా మెగా డిఎస్సి నుంచి మినహాయించి, ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘాల ఆందోళనలకు ఎట్టకేలకు మే నెల 13న సిఎం చంద్రబాబు స్పందించి, వందశాతం ఆదివాసులకే ఏజెన్సీలోని ఉద్యోగాలు కల్పించేలా చట్టం చేస్తామని ప్రకటించారని, మూడు ఆప్షన్ పై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారని నేటికి స్పష్టమైన ప్రకటన చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని ఈనెల 21 యోగా దినోత్సవం సందర్భంగా స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న బాలదేవ్


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి

- సిఐటియు

ప్రజాశక్తి - చింతూరు : జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. చింతూరు ముఖ్య నాయకులు సమావేశం శ్యామల వెంకటరెడ్డి భవనంలో రవ్వ వీరమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మూడోసారి బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు చట్టాలన్ని కూడా రద్దు చేయాలని ఆయనకి అనుకూలంగా మార్చుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల హామీలను ఇవ్వడం జరిగింది. వాటిలో ఏ ఒకటి కూడా కార్మికులకి అనుకూలంగా లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, మండల కమిటి సభ్యులు కారం సుబ్బారావు, చింత రాంబాబు పాల్గొన్నారు.

నైట్ హాల్ట్ బస్సుల నిలిపివేత

ప్రజాశక్తి -సీలేరు : మారేడుమిల్లి కింటుకూరు అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మావోయిసులు ప్రతీకార దాడులకు దిగి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తారని పోలీసులు భావించి అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా పాడేరు వయా సీలేరు భద్రాచలం, పాడేరు వయా సీలేరు మీదుగా వెళ్లే డొంకరాయి నైట్‌హాల్ట్, విశాఖ వయా చింతపల్లి సీలేరు మీదగా వెళ్లే భద్రాచలం నైట్ సర్వీసులు, విశాఖ వయా చింతపల్లి మీదగా సీలేరు వచ్చే నైట్‌హాల్ట్ బస్సు, పగటిపూట నడిచే అనకాపల్లి- సీలేరు నర్సీపట్నం - సీలేరు విజయవాడ - సీలేరు, రాజమండ్రి- సీలేరు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసులను గురువారం నుంచి శనివారం వరకు నిలిపివేయాలని ఆర్టిసి అధికారులకు పోలీసులు ఆదేశించారు. ఈ మేరకు బస్సు సర్వీసులను నిలుపుదల చేశారు. విశాఖ డిపోకు చెందిన పగటిపూట తిరిగే విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి జికె వీధి, సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే ఒక్క బస్సు సర్వీస్ మాత్రమే తిప్పే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆశ్రమ పాఠశాలకు రక్షణ కరువు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాలలో గొర్రెగేదెలు సంచరిస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో అటవీ ప్రాంతం నుంచి గొర్రెగేదెలు, అడవి పందులు ఇతర జంతువులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి. రక్షణగోడ నిర్మించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. గురువారం అర్ధరాత్రి పాఠశాల క్రీడా మైదానంలో గొర్రెగేదె సంచరిస్తోందని గమనించి విద్యార్థులు ఎవరు బయటికి రావద్దని ఉపాధ్యాయులు అప్రమత్తం చేశారు. కొంత సమయం తర్వాత గొర్రెగేదె అటవీప్రాంతంలోకి వెళ్లిపోయింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.


తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడుతున్న వివి జయ

ఆర్‌ఆర్ రిసార్ట్స్ యజమానిని అరెస్టు చేయాలి

- బాలుడిని తక్షణమే విడుదల చేయాలి

- ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వివి.జయ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఆర్‌ఆర్ రిసార్ట్స్ యజమానిని అరెస్టు చేసి, అక్రమంగా అరెస్ట్ అయిన బాలుడిని విడుదల చేయించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వివి జయ డిమాండ్ చేశారు. అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ శీర్ల మామిడి వలస గ్రామంలో అన్యాయంగా అరెస్ట్ అయిన బాలుడు ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శీర్ల మామిడవలస గ్రామంలో ఆర్‌ఆర్ రిసార్ట్స్ నడుపుతున్న యాజమాన్యం చేసిన తప్పుతో బాలుడు అరెస్టుకు ప్రత్యక్ష కారణమైనందుకు యాజమానీ పై తగు చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె బాధిత తల్లిదండ్రులు, బంధువులను పరామర్శించారు. గిరిజన ప్రాంతంలో అక్రమంగా బినామీ పేరుతో నడుస్తున్న అనేక రిసార్ట్స్ లాడ్జిలు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనేక సంఘటనలు లోపాయకరంగా జరుగుతున్నాయన్నారు.బినామీల పేరుతో అనేక మంది గిరిజనేతరులు అక్రమంగా రిసార్ట్స్ నడుపుతు న్నారన్నారు.ఆ రిసార్ట్స్ లోని చిన్నపిల్లల చేత అసాంఘిక కార్యక్రమాలకు ప్రోత్సహిస్తున్నారు.చట్ట వ్యతిరేకమైన పనులు చేయిస్తూ బాల కార్మికుల చేత వెట్టి చాకిరి చేయిస్తూ,బాల కార్మికులను శిక్ష పడే విధంగా కొంతమంది గిరిజనేతలు ప్రోత్సహిస్తున్నారన్నారు. గిరిజనేతరుడు చేసిన పనికి అమాయకమైన గిరిజనుడు అక్రమ కేసులో బాలుడు అరెస్ట్ అయ్యి తల్లిదండ్రులకు దూరమైన పరిస్థితి నెలకొందన్నారు. బాలుడిని తక్షణమే విడుదల చేసి ప్రోత్సహించిన యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు.గిరిజన ప్రాంతంలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు, బినామీ పేర్లతో రిసార్ట్స్ నిర్మించి అమాయక గిరిజనులను పని పేరుతో నమ్మించి మోసం చేస్తున్నా ఇలాంటి యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది లాడ్జిల పరివేక్షణ లోపంతోనే ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పద్మాపురం పంచాయతీ ఉపసర్పంచ్ భగత్ రామ్, గిరిజన సంఘం మండల నాయకులు రామన్న, మండల కమిటీ మెంబర్ సునీత, స్వాతి, బాలుడు తల్లిదండ్రులు దుక్కు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరనాయుడుకు డిఎంహెచ్‌ఒగా అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి- పాడేరు:- సివిల్ సర్జన్‌లకు నిర్వహించిన సాదారణ బదిలీలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సి జమాల్ భాషా ని జోనల్ మలేరియా అధికారిగా కడపకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కంటి చికిత్సల విభాగం లో ప్రోగ్రామ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టి విశ్వేశ్వరరావు నాయుడుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గా అదనపు భాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.



గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి : ఏజెన్సీలోని గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ద్వారా గిరిజనులకు అవగాహన కల్పిస్తామని రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్‌వి. రమణ పేర్కొన్నారు. శుక్రవారం మారేడుమిల్లి మండలం డి.వెలమలకోటలో డిఎ జుగా పథకం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎజుగా) పథకం అమలు చేయడానికి కొన్ని గ్రామాలు గుర్తించడం జరిగిందన్నారు. ఈ గుర్తించిన గ్రామాల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో కమిటీలు వేశామన్నారు. ఏజెన్సీలో అన్ని గిరిజన తెగలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ డిఎ జుగా ద్వారా అవగాహన సదస్సులలో అర్హులైన లబ్ధిదారులకు ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్ భారత్‌కార్డులు, పిఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్య ఆరోగ్య సేవలు అందించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ కొన్ని పథకాలు అదేవిధంగా గ్యాస్ కనెక్షన్లు లేని లబ్ధిదారులను గుర్తించి పిఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి బ్యాంక్ ఖాతా తప్పనిసరిగా ఉండాలన్నారు. డిఎ జుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. ఈ పథకాన్ని సమర్ధంగా అమలు చేయడానికి మండల, గ్రామస్థాయిలో కమిటిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పనిచేసి దర్తి అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఎ జుగాను) విజయవంతంగా నిర్వహించి గిరిజన ప్రాంత అభివద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివికోట పంచాయతీ సర్పంచ్ బట్ట సోమలమ్మ పంచాయతీ కార్యదర్శి డి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎపిఒ జనరల్ రమణ

వేతనాలు చెల్లించకుంటే 5 నుంచి సమ్మె

సత్యసాయి పంపుహౌస్ కార్మికుల హెచ్చరిక

ప్రజాశక్తి - మారేడుమిల్లి : గిరిజన ప్రాంతంలో ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యం బారిన పడుతుండడంతో వారికి శుద్ధిచేసిన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో 2005లో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో మారేడుమిల్లి మండలం కుట్రవాడలో ఫిల్టర్‌హౌస్ నిర్మించారు. అప్పటినుండి జిల్లాలోని వందల గిరిజన గ్రామాలకు తాగునీరు అందుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడింది. అయితే సత్యసాయి పంపుహౌస్‌లో పనిచేసే కార్మికులకు 20 నెలలు పనిచేస్తే మూడు నెలల వేతనాలు చెల్లించి మిగిలిన 17 నెలలు వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ వెళ్లిపోయారని, అతనిని వేతనాలు చెల్లించాలని కోరగా ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు వచ్చిన తర్వాత చెల్లిస్తానని సమాధానం ఇస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కార్మికులు పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని హైకోర్టును ఆశ్రయిస్తే కోర్టు వారు కలెక్టర్‌ని సమస్య పరిష్కరించాలని 2024 ఏప్రిల్‌లోనే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారని అయినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. తన కాంట్రాక్ట్ కూడా మార్చితో ముగిసిపోయిందని చెబుతున్నాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 17 నెలలుగా వేతనాలు లేకుండా నానా అవస్థలు పడుతున్నామని అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో జూలై 5వ తేదీ నుంచి సమ్మె చేయనున్నామని హెచ్చరించారు.

ఎకో జోన్‌ను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో తీర్మానం


గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - వి.ఆర్.పురం : పాపికొండల నేషనల్ పార్కుకు అనుబంధంగా ఎకో సెన్సిటివ్‌జోన్ పేరిట రేఖపల్లి పంచాయతీ పరిధిలోని అన్నవరం, ఉమ్మడివరం, రేఖపల్లి గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఎకో సెన్సిటివ్‌జోన్ పేరిట పాపికొండల నేషనల్ పార్కు కు అనుబంధంగా మీమీ గ్రామ పరిసరాల్లో భూమిని కొంతభాగం సేకరించడం గ్రామసభ లక్ష్యమని గ్రామస్తుల అందరి అంగీకారం మేరకే ఈ సభ తీర్మానం చేస్తుందని తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ ఎకోజోన్ పేరిట గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలియజేశారు. స్థానిక గిరిజనులు ఓ ప్రక్క పోలవరం ప్రాజెక్టులో కొద్ది భూమి మునిగి పోతుంటే మరో ప్రక్క ఎకోసెన్సిటివ్ జోన్ పేరిట ఫారెస్ట్ అధికారులు భూమిని సేకరించడానికి ప్రయత్నించడం పద్ధతి కాదని, భూమిపై తమకు ఎంతో హక్కు ఉందన్నారు. భూములు సేకరించడానికి చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎకోజోన్‌కు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం చేయాలని ఆయా గ్రామాల ప్రజలందరూ ఏకగ్రీవంగా నిర్ణయించి తీర్మానించారు. గ్రామసభల్లో పంచాయతీ సర్పంచ్ పూనెమ్ సరోజిని, ఎంపిటిసి బంధం విజయలక్ష్మి, ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు, పీసా కమిటి ఉపాధ్యక్ష, కార్యదర్శులు పాండ్రాజు, వేటగానిసూరి, పాయం సుబ్బారావు పాల్గొన్నారు.

యోగాంధ్రకు తరలిన విద్యార్థులు



డుంబ్రిగుడ నుంచి వెళుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి చింతపల్లి: విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగాకు దినోత్సవ రాష్ట్రస్థాయి మహోత్సవానికి చింతపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు, యోగ వాలంటీర్లు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షకురాళ్లుతరలివెళ్లారు.

డుంబ్రిగుడ: యోగాకు మండల వ్యాప్తంగా 48 బస్సులను కేటాయించగా, 2800 మంది విద్యార్థులు విద్యార్థులు తరలి వెళ్లారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు వివిధ శాఖ అధికారులు మండలం నుంచి విశాఖకు తరలి వెళ్లారు.

సీలేరు: ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం సందర్భంగా జీకే వీధి మండలం సీలేరులో వివిధ శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్ గ్రౌండ్ ఆవరణలో మరియు ఏపీ జెన్కో కళ్యాణమండపం పంచాయతీ కార్యాలయం వివిధ పాఠశాలల్లో యోగ నిర్వహించడానికి సంబంధిత అధికారులు అని ఏర్పాటల్లో నిమగ్నమయ్యారు. పోలీస్ స్టేషన్లో ఉదయం ఏడు గంటలకు పంచాయతీ కార్యాలయంలో 6:30 నిమిషాలకు ఏపీ జెన్కో కల్యాణ మండపంలో ఎనిమిది గంటలకు కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కలెక్టరేట్లో రెవెన్యూ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరిపాలనా అధికారి ఎం.బి. అప్పారావు అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్ కో ఆర్డినేషన్ విభాగం సూపరిండెంట్ సి.హెచ్. తిరుమలరావు మాట్లాడుతూ, ప్రజలకు రెవెన్యూ సేవలను సక్రమంగా అందించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, సిబ్బందిపైనే ఉందన్నారు. ఎన్నికలు, విపత్తులు, తుఫానులు, వరదులు సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ చర్యలు చేపడతామన్నారు.

రిటైర్డ్ ఎస్ డిసిటి.అప్పారావు మట్లాడుతూ,ప్రభుత్వం రెవెన్యూ సేవల ఆవశ్యకతను గుర్తించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం అదేశించిందన్నారు. రెవెన్యూ శాఖ సహకారం అన్ని శాఖలకు అవసరం ఉంటుందన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ ఈశ్వరావు మాట్లాడుతూ రెవెన్యూ డిపార్టుమెంటు నిరంతరం ప్రజలకు సేవలందిస్తుందన్నారు. రెవెన్యూ శాఖలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరిండెంట్ నాగరాజు, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి పి. పోలరాజు, రిటైర్డ్ ఆర్ఐ శ్రీహరి, డిటి రామ్మూర్తి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో అమాయక ఆదివాసుల దగ్గర వేలాది రూపాయలు ప్రయివేటు పాఠశాలలు ఫీజులు పేరిట అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లే స్కూల్ నుండి టెన్త్ వరకు సంవత్సరానికి సంబంధించి ఫీజు 20వేల నుండ్చి 35, వేలు 40 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు.బుక్స్ పేరుతో ప్లే స్కూల్ , యూకేజీ నుండే టెన్త్ వరకు 2,500 రూపాయల నుండి దాదాపు 6,000 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు.యూనిఫామ్, బెల్టు, టోపీ, ఐడి కార్డుల పేరుతో అదనంగా వేలాది రూపాయలు దోచుకుంటున్నారన్నారు.

సత్వరమే సమస్యలను పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత


వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు 43 వినతులు అందాయి. జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారుల సౌకర్యం, భూ సమస్యలు, రేషన్ కార్డులు, విద్యుత్తు సదుపాయల కోసం వినతులు అందాయి. స్వీకరించిన వీటిని సంబంధిత అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీ గులుగొండ గ్రామస్తులు కిల్లో విన్ని, కిల్లో ఆనందరావు, కిల్లో మోహనరావు తదితరులు నూతనంగా నిర్మించుకున్న గృహాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని, ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ డింబుగూడ గ్రామానికి చెందిన వార్డు మెంబరు రాజేశ్వరి తమ గ్రామానికి సిసి రోడ్డు, తాగునీటి పథకం మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పాడేరు మండలం దేవాపురం పంచాయతీ అంటిలోవ గ్రామానికి చెందిన పి.నూకరాజు తల్లికి వందనం మంజూరు చేయాలని కోరారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయితీ కిండంగి గ్రామానికి చెందిన ఎస్.కుసుమ ఇంటి నివాస స్థలం, రేషన్ కార్డు మంజూరు చేయాలని దరఖాస్తును అందజేసారు. జి.మాడుగల మండలంలోని 17 పీసా కమిటీలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని జి.మాడుగుల పీసా కమిటి మండల అధ్యక్షులు లకే రామకృష్ణ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, ట్రాన్స్ కో ఎస్ఇ జిఎన్.ప్రసాద్, డిఎంహెచ్ఒ జమాల్ భాషా, పిఆర్ ఇఇ టి.కొండయ్య పడాల్, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు లింగాల రాజా రవికుమార్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడం లేదని
ప్రధాని మోడీతో ప్రకటన చేయించాలి



కొమ్మాదిలో కరపత్రాలు పంచుతూ నిరసన ర్యాలీలో సిఐటియు నేతలు

ప్రజాశక్తి- మధురవాడ :విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా, ఉక్కు పరిరక్షణకు ఉద్యమిస్తున్నకాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం అన్యాయమని, తొలగించిన నాలుగువేల పైచిలుకు కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కొమ్మాది కూడలి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని విశాఖ వస్తున్న ప్రధాని మోడీతో రాష్ట్రంలోని కూటమి ప్రకటన చేయించాలని నినాదాలు చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు, కార్మికులను మభ్యపెట్టి, మోసపుచ్చుతున్నాయని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న కాంట్రాక్టు కార్మికులపై కక్షగట్టి దఫాలవారీగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇప్పటికే నాలుగు వేలమంది కాంట్రాక్టు కార్మికులకు ఉద్వాసన పలికి రోడ్డు పాల్జేశారని, వారంతా కుటుంబాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు మరీ ముఖ్యంగా కార్మికులకు కూటమి ప్రభుత్వ చేస్తున్న అన్యాయాన్ని అన్ని వర్గాల ప్రజలు ఎండగట్టి, కార్మికులకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ యోగాదినోత్సవానికి 21న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు పేడాడ రాజశేఖర్, టి.తిరుపతి, రాము, కె.కృష్ణ, సింహాచలం పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, వైసిపి నేతలు ఆరోపించారు. శుక్రవారం ఆరిలోవ కాలనీ వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు.ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 'జగన్ నమ్మకం, చంద్రబాబు మోసం' అంటూ వార్డు వైసిపి నేత సత్యాల వెంకట్ సాగరిక ఆధ్వర్యంలో నిరసన నినాదాలు చేశారు. వైసిపి నాయకులు వనం వరలక్ష్మి, వాసు, కాకర గోవింద్, బాబూరావు, సుబ్బారావు, శ్రీను పాల్గొన్నారు.

కూటమి అక్రమ కేసులను తిప్పికొట్టాలి

వైసిపి బలోపేతానికి లీగల్ సెల్ నుండి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో లీగల్‌సెల్ జిల్లా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు బాజినాయుడు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జాతీయ రహదారిపై బైక్‌లు ఢీ

- నలుగురికి గాయాలు


గాయపడిన మహిళ

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని రౌరింతాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు దంపతులు సహా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎర్రబొమ్మల గ్రామానికి చెందిన బేరా వెంకటరమణ (38), ఆయన సతీమణి బేరా హేమలత (35) దంపతులు చింతపల్లి సచివాలయంలో తల్లికి వందనం పథకానికి సంబంధించిన ఫిర్యాదు చేయడానికి వచ్చి, స్వగ్రామానికి తిరుగు వెళుతున్నాడు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కిన్నెర్ల గ్రామానికి చెందిన కొర్ర నీలకంఠం (21), కొర్ర వినోద్ కుమార్ ఇద్దరు యువకులు వేరొక ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తూ ఎదురుగా వచ్చి బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటరమణ, హేమలతకు తీవ్ర గాయాలయ్యాయి. నీలకంఠం, వినోద్ కుమార్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 108 వాహనంలో బాధితులను చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దంపతుల పరిస్థితి విషమంగా ఉండటంతో కింగ్ జార్జి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆవిరైన విదేశీ ఉద్యోగం ఆశలు!

- పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆనందపురం : విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేయాలన్న ఆశలు నెరవేరకపోవడంతో మనస్తాపంతో ఒక యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి.

మండలంలోని వెల్లంకి పంచాయతీ కేంద్రంలో పైడా వెంకటలక్ష్మి, సూరిబాబు దంపతులు నివాసముంటున్నారు. అయితే వెంకటలక్ష్మి వెల్లంకిలో వంట పనులు చేస్తుండగా, సూరిబాబు బొడ్డపాలెం ప్లైవుడ్ కంపెనీలో పనిచేస్తున్నారు. పెద్దకుమారుడు పైడా అప్పలరాజు (24) డిగ్రీ పూర్తి చేసి వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటుండగా, చిన్న కుమారుడు చంద్రశేఖర్ కూడా ఇంటర్మీడియట్ పూర్తయ్యాక అదే పనిలో ఉన్నాడు.

దుబాయ్ వెళ్లాలన్న ఆశతో అప్పలరాజు గతేడాది ఢిల్లీ వెళ్లి ఇంటర్వ్యూకు హాజరై విజయవంతమయ్యాడు. వీసా ఖర్చుల కోసం రూ.లక్షన్న ఖర్చుచేసినా, నిర్వాహకుల నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో విదేశీ పర్యటన రద్దయ్యింది. దీంతో తీవ్ర నిరాశకు గురైన అప్పలరాజు, అప్పట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినా, ప్రాణాలతో బయటపడ్డాడు.

తాజాగా ఈనెల 15న, మళ్లీ దుబాయ్ ప్రయాణానికి ప్రయత్నిస్తూ రూ.1లక్ష కావాలని తల్లిదండ్రులను కోరాడు. అయితే ఇద్దరూ కలిసి వైజాగ్‌లోనే పని చేయండి అంటూ తండ్రి సూరిబాబు మందలించడంతో అప్పలరాజు మనస్తాపానికి గురయ్యాడు. అప్పటి నుంచి భోజనం చేయడం మానేశాడు 19న ..గురువారం ఉదయం తల్లి వెంకటలక్ష్మిని బైక్‌పై ఆమె పనిచేసే కంపెనీ దగ్గర వదిలి, ఇంటికి వచ్చిన అప్పలరాజు, గదిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నాడు. మధ్యాహ్నం రెండు గంటలైనా బయటకు రాకపోవడంతో తలుపు తెరిచి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచంపై వాంతులు, పక్కనే గడ్డి మందు బాటిల్ కనిపించడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఉండి, 108 వాహనానికి సమాచారమిచ్చి కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో గురువారం అర్ధరాత్రి 12:30 గంటలకు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గంట్యాడ సంతోష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తును ఎఎస్ఐ జి.సత్తిబాబుకు అప్పగించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించగా, శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

బినామీ పేర్లతో రిసార్ట్స్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


లోతా రామారావు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా నడుస్తున్న రిసార్ట్స్, లాడ్జిలు, హోటల్స్‌పై చర్యలు తీసుకోవాలని వాటిని గిరిజన సొసైటిలకు అప్పగించి, గిరిజనులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు.. రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతంలో గిరిజనేతరులు బీనామీలుగా వ్యవహరిస్తూ క్రమంగా టూరిజం, రెస్టారెంట్స్, లాడ్జిలు, రిసార్ట్లలను ఎటువంటి లైసెన్సలు, అనుమతులు లేకుండా నడిపిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ఐదో షెడ్యూల్ ప్రాంతాలకు 1996 పీసా చట్టం, 1998 ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్‌చట్టం విస్తరణ పీసాను అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అక్రమ కట్టడాలు, ఎటువంటి వ్యాపారాలు చేయకూడదని చట్టాలు చెబుతున్నప్పటికీ గిరిజన చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా నడుస్తున్న రిసార్ట్స్, లాడ్జిలు రెస్టారెంట్లు ఆక్రమ కట్టడాలపై అన్ని ఆధారాలతో ఉన్నతాధికారులకు త్వరలో నివేదిక అందిస్తున్నామన్నారు.


మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

నియోజకవర్గ సమస్యలపై మంత్రి లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - రంపచోడవరం : మంత్రి నారా లోకేష్‌ని కలిసిన రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి నియోజకవర్గంలో పలు సమస్యలు, ఇటీవల రహదారుల వెడల్పు చేయు నిమిత్తం నష్టపోయిన అర్హులకు న్యాయం చేయాలని వివరించారు. అదే విధంగా రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని మండలాలలో ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన భవనాల నిర్మాణం కోసం వివరించారు. మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి నియోజకవర్గంలో సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు

సక్రమంగా ఉపాధి పనులు కల్పించకపోతే చర్యలు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: ఉపాధి శ్రామికులకు సిబ్బంది సక్రమంగా పనులు కల్పించాలని లేనిపక్షంలో అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, ఉపాధి హామీ విజిలెన్స్ అధికారి సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ యాదగిరేశ్వరరావు, విజిలెన్స్ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ. ఇప్పటివరకూ 4 లక్షల పని దినాలు ఉపాధి శ్రామికులకు కల్పించాల్సి ఉండగా కేవలం1.70 లక్షల పనులు మాత్రమే పనులు జరిగాయన్నారు. పనులు కల్పించడంలో జిల్లాలో రాజవొమ్మంగి మండలం చివరి స్థానంలో ఉందనిఇది సరైన పద్ధతి కాదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వారంలోగా తాగునీటి సమస్య పరిష్కారం

సిఐటియు ఆందోళనతో దిగివచ్చిన అధికారులు


బుక్కావీధి వాసుల సమస్యలు వింటున్న జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వన్‌టౌన్ 38వ వార్డు బుక్కా వీధిలో తాగునీటి సమస్యను వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని జివిఎంసి నీటిపారుదల విభాగం అధికారులు డిఇ, ఎఇ శుక్రవారం బుక్కావీధికి వచ్చి, ఆందోళన చేస్తున్న స్థానికులు, సిఐటియు నాయకులను కలిసి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ బుక్కావీధిలో కుళాయిల్లో మురుగునీరు వస్తోందని, ఆ నీరు తాగితే పలువురు డయేరియా వంటి వ్యాధులకు గురి అయ్యారని చెప్పారు. సమస్యపై గతంలో స్థానికలతో కలిపి ఆందోళన నిర్వహించామని, కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో, రెండు రోజుల క్రితం మరోసారి ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదన్నారు. దీంతో బీచ్‌రోడ్‌లో యోగా నిర్వహించి నిరసన కార్యక్రమం చేయాలని నిర్ణయించామని తెలిపారు. విషయం తెలియడంతో అధికారులు వచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే ఎఈ డిఈ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం. సుబ్బారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రెవిన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రంపచోడవరం రెవిన్యూ డివిజన్‌లోని వివిధ స్థాయిల్లో రెవిన్యూ ఉద్యోగులంతా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారి వారి అనుభవాలను పంచుకున్నారు. రెవిన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ రెవిన్యూ ఉద్యోగులు పి.సూర్యారావు, కె.ఆదినారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాడేరు జిల్లా రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు ఎన్. చెల్లాయమ్మ, వి.పాల్ అలెగ్జాండర్, రంపచోడవరం రెవిన్యూ డివిజన్ అసోసియేషన్ సభ్యులు జిలానీ (ఫయాజ్ భాషా), సత్యనారాయణ, వి.రవీంద్ర బాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు బాధ్యతల స్వీకరణ


వ్యవసాయాధికారి శివశ్రీనివాస్


ఎపిఒ శ్రీనివాస్


రాజ ఒమ్మంగి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

వ్యవసాయాధికారిగా శివశ్రీనివాస్

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రం వ్యవసాయ అధికారిగా శివ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అనపర్తి మండలంలో సహాయ వ్యవసాయ సంచాలకు వారి కార్యాలయంలో పిఎ టు ఎడిఎగా పనిచేశానని చెప్పారు. ఇక్కడ పని చేసిన ఎం.యం.సువర్ణకుమారి గొల్లపూడి, కృష్ణా జిల్లా బదిలీపై వెళ్ళారని తెలిపారు. అడ్డతీగల మండలానికి అన్ని రైతుసేవా కేంద్రాలకు విత్తనాలు రావడం జరుగుతుందని మొలకశాతం చూసాక రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు .ఇప్పుడు వరకు మండలంలో 550 క్వింటాల్ విత్తనాలు వచ్చిందని తెలిపారు.

ఎపిఒగా శ్రీనివాసరావు..

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఉపాధి హామీ ఎపిఒగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు గతంలో విఆర్.పురం ఎపిఒగా పనిచేసి బదిలీపై రాజవొమ్మంగి వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన ఎపిఒ రెడ్డిబాబు వీఆర్.పురం బదిలీపై వెళ్ళారు.

ఈ సందర్భంగా ఉపాధిహామీ కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా శ్రీనివాసరావు

రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బల్లంకి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు ఇప్పటివరకు కాకినాడ పిఆర్ కళాశాలలో రసాయనిక శాస్త్ర అధ్యాపకులుగా పనిచేసి పదోన్నతపై రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కళాశాల సిబ్బంది, అధ్యాపకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవుల మరియదాస్

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అరెస్టు కక్ష సాధింపే..

- వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవుల మరియదాస్

ప్రజాశక్తి - వీఆర్ పురం: మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ కక్ష సాధింపు చర్యలో భాగమేఅని వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవుల మరియదాస్ అన్నారు. జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు అధ్యక్షతన మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఇంట్లో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియదాస్ మాట్లాడుతూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని లిక్కర్ కేస్‌లో కావాలనే అరెస్ట్ చేసారన్నారు. లిక్కర్ స్కాంకి అతనికి సంబంధం లేదని వైసిపిలో చురుగ్గా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, వైసిపి అనుబంధ సంఘాలకు ఆర్గనైజర్‌గా ఉన్నాడని ఆయనను అరెస్ట్ చేసారని విమర్శించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి పరాభవం తప్పదన్నారు. ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పరిధిలో ఆధార్ మెగా క్యాంపులు ప్రారంభం


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అపూర్వభరత్

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆధ్వర్యంలో జూన్ 24 నుంచి మూడు రోజులు ప్రత్యేక ఆధార్ మెగా క్యాంపులు నిర్వహిస్తున్నామని ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ తెలిపారు. క్యాంపుల ప్రధాన ఉద్దేశం పివిటిజి కమ్యూనిటిలో ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు కల్పించటం, 100 శాతం నమోదుతో ఆధార్ సంతృప్తి స్థాయికి తీసుకురావడమే అన్నారు. చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లోని గ్రామాలకు చెందిన ఆధార్‌లేని ప్రతి ఒక్కరూ కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ నవీకరణ, ఆధార్ అప్డేట్ వంటి సేవలు ఈ సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని ఆయన సూచించారు. సచివాలయ సిబ్బందికి సమన్వయం బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఐటిడిఎ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించాలి


సూచనలు చేస్తున్న ఎంఈఓ 2 సూరారెడ్డి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల సిబ్బంది మెనూ సక్రమంగా అందించాలని ఎంఈఓ 2 సూరారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఎంఈఓ మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు పరిశుభ్రంగా భోజనం పెట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల రిజిస్టర్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ సుమారు 250 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు తెలిపారు. మండలంలో 5 ఏళ్లు నిండిన చిన్నారులు 420 మంది ఉన్నారన్నారు. ఇంకా పాఠశాలల్లో చేరికలు చేర్పించాలన్నారు.